క్లుప్తంగా

జాతీయ రహదారి వద్ద మంటలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జాతీయ రహదారి వద్ద బుధవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. పర్యటనలో భాగంగా ఇక్కడికి వచ్చిన ఏఎంవోహెచ్ డా. కిషోర్ దీనిని గమనించి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఎవరో ఆకతాయిలు అగ్గి పెట్టి ఉంటారని, గాలి ప్రభావంతో మంటలు చెలరేగాయని ఏఎంవోహెచ్ తెలిపారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం



బాధితురాలు కళావతికి సాయం అందిస్తున్న సర్పంచ్ లక్ష్మి, వైస్ సర్పంచ్ రమణమ్మ

తగరపువలస: ఆనందపురం మండలం పొడుగుపాలెంలో ఈ నెల 23న అగ్నిప్రమాదంలో పూరిల్లుతో పాటు నిత్యావసర సరకులు, గృహోపకరణాలు కాలిపోయిన బాధిత కుటుంబాన్ని సర్పంచ్ చందక లక్ష్మి, వైస్ సర్పంచ్ బంటుపల్లి రమణమ్మ బుధవారం పరామర్శించారు. వారి కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. బాధితురాలు బంటుపల్లి కళావతికి సర్పంచ్ లక్ష్మి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు, రూ.2వేల నగదు అందించారు. వైస్ సర్పంచ్ రమణమ్మ తన వంతు సాయంగా 25 కిలోల బియ్యం అందించారు. వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు చందక అప్పలస్వామి, కన్వీనర్ షిణగం రామారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



మజ్జివలసలో వరికోత పొలాలను పరిశీలిస్తున్న భీమిలి వ్యవసాయాధికారులు

తగరపువలస: వరికోత పూర్తయిన రైతులు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని భీమిలి వ్యవసాయాధికారులు సూచించారు. భీమిలి మండలం మజ్జివలస, తాటితూరు పంచాయతీలలో వరికోతలు పూర్తయిన పొలాలను భీమిలి ఏడీ విజయప్రసాద్, ఏవో శివకోమలి పరిశీలించారు. కోతలు పూర్తయిన రైతులు పనలు పొలంలో వదిలేయకుండా కుప్పలుగా పెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం వరికోతలు, నూర్పులు పూర్తయిన రైతులు ధాన్యం నిల్వ చేసుకునే మార్గం లేకపోతే, దగ్గరలో ఉన్న రైస్‌మిల్లు, రైతుసేవా కేంద్రంలో సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. రైతులు తమ వివరాలతో రసీదు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా అయ్యప్ప మహా సన్నిధానం పూజ



అయ్యప్పస్వామికి నెయ్యితో అభిషేకం చేస్తున్న మాలధారులు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం శ్రీ అయ్యప్పస్వామి సేవాపీఠంలో బుధవారం సాయంత్రం అయ్యప్ప మహా సన్నిధానం పూజ జరిగింది. పీఠం ధర్మకర్త గాడు తాతినాయుడు ఆధ్వర్యంలో కనకల అప్పలరాజు ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేరళ సంప్రదాయం ప్రకారం ప్రవీణ్ కుమార్ నంబూద్రి పడిపూజ, కలశాభిషేకం, పుష్పాభిషేకం, విశేషమైన ద్రవ్యాలతో పంచామృతాభిషేకాలు చేశారు. అర్చకులు నుసరాపు మధుశర్మ, పెంట వెంకటరమణ శర్మలచే అర్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నగరానికి చెందిన ప్రయాగ చక్రవర్తి స్వరార్చన చేశారు.

ఆ కార్యాలయంలో ఫైల్ కదలాలంటే చేతులు తడపాల్సిందే. లేదంటే పెండింగ్, మరికొన్ని తిరస్కరణకు గురవుతున్నాయి. అన్ని విభాగాల్లోనూ ఇదే తీరు అనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సాక్షాత్తు జోనల్ కమిషనరే ఆదాయాన్ని మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ కావడం ఆ ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది.

ఫైల్ కదలాలంటే చేయి తడపాల్సిందే..





మధురవాడలోని జీవీఎంసీ జోన్-2 కార్యాలయం

- జీవీఎంసీ జోన్–2కు అవినీతి జాడ్యం
- ఏసీబీకి చిక్కిన జోనల్ కమిషనర్
- కార్యాలయంలో అన్ని విభాగాలదీ అదే తీరు



మధురవాడ జోనల్ కార్యాలయంలో మంగళవారం సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2 కార్యాలయంలో 'మహా' అవినీతి వెలుగులోకి రావడంతో ఇక్కడి పరిస్థితులు చర్చనీయాంశమయ్యాయి. జోనల్ కమిషనర్ మంగళవారం ఆదాయాన్ని మించి సుమారు రూ. 25కోట్లు పైనే అక్రమ పద్ధతుల్లో ఆస్తులు సంపాదించిన కేసులో అరెస్టు అయ్యారు. 2017లోనూ ఇంటి పన్ను వేయడానికి పై అధికారులకు ఇవ్వాలంటూ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. జోన్–2 పరిధి భీమిలి, తూర్పు నియోజకవర్గాల్లోని బోయిపాలెం–ఆరిలోవ, శంభువానిపాలెం–సాగర్‌నగర్‌ల మధ్య జీవీఎంసీ 5 నుంచి 13 గల 9 వార్డుల్లో విస్తరించి ఉంది. ఇందులో 2,63,000 మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. 1,06,403 నివాసాలు ఉన్నాయి, ఇందులో 98,403 అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. ఈ కార్యాలయంలో ప్రతీ చిన్నపనికీ డబ్బులు ముట్టచెప్పాల్సిందేననే ఆరోపణలున్నాయి.

ఫిర్యాదులకు పటిష్టమైన వ్యవస్థ ఏదీ?

జోనల్ కార్యాలయాల్లో ఫిర్యాదుల పరిష్కారానికి పటిష్టమైన వ్యవస్థ లేకపోయింది. పోలీస్ శాఖలో సీపీనే అందరికీ నేరుగా ఫోన్ నెంబర్ ఇచ్చి ఫిర్యాదు వస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నారు. కానీ జీవీఎంసీలో కమిషనర్‌కు ఫిర్యాదులు ఇచ్చినా, ఆయన అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టమన్నా కింది స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు. బింద్రానగర్ వాసులు అనేక దఫాలుగా ఫిర్యాదులు ఇస్తూ ఉండడమే ఇందుకు తార్కాణం. మధురవాడలో ఏ మూలన చూసినా అక్రమ షెడ్‌లు, నిర్మాణాలు, అనుమతులు లేని అదనపు అంతస్తులు కూడా ఉన్నాయి. కొందరు అయితే కాల్వలు, గెడ్డలు కప్పేస్తున్నా పట్టించుకునే వారు లేరు. వివరణ కోరే ప్రయత్నం చేసినా ఏసీపీ, టీపీవో వంటి వారు కూడా ఫోన్ ఎత్తని పరిస్థితి. ఇక ఫిర్యాదు ఎక్కడ స్వీకరిస్తారో ఉన్నతాధికారులే చెప్పాలి.

రెవెన్యూ విభాగం

పన్ను వేయాలంటే డబ్బు చెల్లించాల్సిందే..

ఇక్కడ రెవెన్యూ విభాగంలో ఆస్తి పన్ను వసూలు, ఖాళీ స్థలాలకు పన్నుల వసూళ్లు తక్కువగా ఉంటున్నాయి. వివిధ వార్డుల్లో సచివాలయ సిబ్బంది, ఆర్ఐల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే తమకు వచ్చే ఆదాయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ఈ విభాగానికి సంబంధించి పూర్తి స్థాయి పర్యవేక్షణాధికారి జోనల్ కమిషనర్. ఆయన ఆధ్వర్యంలో నడుస్తున్న శాఖ పరిస్థితి ఇది. ఒక అసెస్‌మెంట్‌కి పన్ను వెయ్యాలంటే చేతులు తడపాల్సిందేనని, లేదంటే అడ్మిన్ నుంచే కొర్రీలు ప్రారంభం అవుతున్నాయని పలు ఆరోపణలున్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే ఆ ఫైల్ పెండింగ్ లేదా రిజెక్ట్‌కి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఓ వ్యక్తి కుటుంబంతో కూడా వచ్చి ఆందోళన చేసిన సందర్భమూ ఉంది.

దోషులకు శిక్ష పడితే భయం ఉంటుంది



అవినీతి అధికారులపై కేసులు పెట్టడమే తప్ప సరియైన శిక్షలు పడటం లేదు. అవినీతి కేసులు నమోదు చేయడం సర్వసాధారణం అయిపోయింది. వీరిని చట్టప్రకారం శిక్షిస్తే తప్పు చేయడానికి అందరూ భయపడతారు. నామమాత్రంగా కేసులు పెట్టడం.. ఒకటి, రెండు నెలలు తిరగక ముందే వారు మళ్లీ అదే సీట్లో కూర్చోవడంతో ప్రజలకు కూడా ప్రభుత్వాలపై విశ్వాసం పోతోంది. రూ.25కోట్ల వరకు అక్రమ సంపాదన చేసినంత వరకు అధికారులు ఏం చేస్తున్నారు? ప్రభుత్వంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలి.

– మరుపిళ్ల పైడిరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఏ ఫిర్యాదైనా ఇక్కడ బుట్టదాఖలే..



బింద్రానగర్ షిప్‌యార్డు లే అవుట్‌లో ఉడా అప్రూవ్‌డ్ లే అవుట్‌లో పార్కు ఆక్రమణకు గురైంది. దీనిని తొలగించాలని జోనల్ అధికారులకు కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కూడా ఆదేశాలు ఇచ్చారు. కాని ఎవరూ పట్టించుకోలేదు. ఇక్కడ పీజీఆర్ఎస్ ఫిర్యాదులు కూడా బుట్టదాఖలే. ఇక టౌన్ ప్లానింగ్ అధికారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

– కరుణాసాగర్, బింద్రానగర్

టౌన్ ప్లానింగ్

వారిని ప్రసన్నం చేసుకుంటే 'అంతా సక్రమమే..'

టౌన్ ప్లానింగ్‌లో ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని జీవీఎంసీ ప్రధాన కమిషనర్ ఈ జోన్ తీరుపై ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లానింగ్ సెక్రటరీలు వీటిని ప్రోత్సహిస్తే క్రిమినల్ చర్యలు చేపడతామని, తీరు మార్చుకోపోతే సహించేది లేదని హెచ్చరించారు. వెయ్యి నివాసాలకు ఒక ప్లానింగ్ సెక్రటరీ ఉన్నా అక్రమ నిర్మాణాల నియంత్రణకు ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేస్తామన్న స్థాయికి ఉన్నతాధికారులు వచ్చారంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే.. అయితే టౌన్ ప్లానింగ్ అధికారులను, ప్లానింగ్ సెక్రటరీలను లేదా అధికార పార్టీ నాయకులను, వారి అనుచరులను ప్రసన్నం చేసుకుంటే ఎలాంటి అక్రమ నిర్మాణం అయినా సాగిపోతుంది. గత ప్రభుత్వం హయాంలో చిన్న ఫిర్యాదు వస్తే క్షణాల్లో వాలిపోయి చర్యలు చేపట్టే అధికార యంత్రాంగం, ఇప్పుడు వారికి సాగిల పడిపోతోందనే విమర్శలు వస్తున్నాయి. మిగిలిన విభాగాలు కూడా ఇందుకు మినహాయింపు కాదు.

బాల్‌రంగ్ పోటీల విజేత నెహ్రూ పాఠశాల



జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన నెహ్రూ ఉన్నత పాఠశాల విద్యార్థులు

భీమునిపట్నం: ఇక్కడి జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) వద్ద బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి బాల్‌రంగ్ పోటీల్లో భీమిలి నెహ్రూ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం గెలుచుకున్నారు. థింసా, కోలాటం, ఫోక్ డ్యాన్స్ మొదలైన అంశాల్లో పోటీలు నిర్వహించగా, జిల్లాలోని ఐదు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో థింసా నృత్య ప్రదర్శనలో నెహ్రూ ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం మొదటి స్థానం గెలుపొందింది. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ మాట్లాడుతూ విజేతలు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.నాగేశ్వరరావు, పి.హరిణి, మాధవి, నీలిమ, మహలక్ష్మి, త్రినాథరావు పాల్గొన్నారు.

మత్స్యకారుడికి గాయాలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడకు చెందిన దౌలపల్లి ఎల్లాజీ తీవ్ర గాయాలపాలయ్యాడు. తుఫాన్ నేపథ్యంలో తన ఫైబర్ బోటును తీర ప్రాంతానికి సురక్షితంగా తరలించే క్రమంలో ఇంజిన్‌కు సంబంధించిన ఓ పరికరం బలంగా ఎల్లాజీ గొంతుకు తగలడంతో, గాయమైంది. ఇది గమనించిన స్థానిక మత్స్యకారులు ఎల్లాజీని హుటాహుటిన రుషికొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గొంతుకు శస్త్ర చికిత్స జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

దీపోత్సవంపై సమావేశం నేడు

పద్మనాభం: పద్మనాభంలో అనంత పద్మనాభ స్వామి మెట్ల పంక్తిపై ఈ నెల 30వ తేదీన జరగనున్న దీపోత్సవంపై గురువారం సమావేశం నిర్వహించనున్నట్టు ఈవో నానాజీ బాబు తెలిపారు. కుంతీ మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి భక్త బృందం సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఎట్టకేలకు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..



రామవరం సర్వే నం.121లో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

తగరపువలస: ఎట్టకేలకు ఆనందపురం మండలం రామవరం గ్రామ రెవెన్యూ పరిధి సర్వేనంబర్ 121లో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది బుధవారం హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. ఇదే సర్వే నంబర్‌లో పంచాయతీకి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు స్మార్ట్ టౌన్‌షిప్‌కు కేటాయించిన 8 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు దేముడు బాబు, పెంటయ్య గత నెల 28న ఆనందపురం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా మరుసటిరోజు సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై ఆలస్యంగా స్పందించిన రెవెన్యూ అధికారులు హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ భూమి కబ్జాకు తెరపడిందని వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

జ్యూట్‌మిల్లు కొలతలను అడ్డుకున్న కార్మికసంఘాలు



జ్యూట్‌మిల్లు స్థలంలో విక్రయానికి కొలతలు వేయకుండా అడ్డుకున్న కార్మిక నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు మూతపడి 15 ఏళ్లు అవుతున్నా యజమాని బజోరియా కార్మికులకు ఇప్పటికీ పూర్తిగా పరిష్కారం చేయలేదని ఐక్య కార్మికసంఘాల ప్రతినిధులు అన్నారు. బకాయిలు చెల్లించిన తరువాతే మిల్లు ఆస్తుల విక్రయం జరగాలని స్పష్టం చేశారు. మిల్లు పక్కన ఆస్తుల విక్రయంలో భాగంగా యాజమాన్య ప్రతినిధులు బుధవారం కొలతలు వేస్తుండగా వీరు అడ్డుకున్నారు. కార్మిక నాయకులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో 90 శాతం మంది కార్మికులకు సెటిల్‌మెంట్ జరిగిందన్నారు. మిగిలిన బకాయిల కోసం కార్మికులు, కార్మిక సంఘాలు, మిల్లు చుట్టూ తిరుగుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు మాసాలు గడుస్తున్నా మిల్లు యాజమాన్యాన్ని పిలిపించకుండా జాప్యం చేస్తోందన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జోక్యం చేసుకుని మిగిలిన బకాయిలు కార్మికులకు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక నాయకులు జీరు వెంకటరెడ్డి, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, చిల్ల రాంపైడి పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పర్యావరణ పరిరక్షకులు

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



కార్యక్రమం ప్రారంభిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

కొమ్మాది: నేటి బాలలే రేపటి పర్యావరణ పరిరక్షకులని, వారికి ప్రకృతిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్ అన్నారు. గీతంలో ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ 'వ్యర్థాల నిర్వహణ సర్క్యులర్ ఎకానమీ'పై నిర్వహిస్తున్న 14వ అంతర్జాతీయ సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలు మనుగడ సాగించాలంటే విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. విశాఖ నగరంలో 24 లక్షల గృహాల నుండి 1200 టన్నుల వ్యర్థాలను రోజూ సేకరిస్తున్నామని, వీటి నుండి 15 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరుగుతుందని తెలిపారు. వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పాదన పెంచడం, శుద్ధి చేసిన మురుగు నీటిని మాత్రమే సముద్రంలోకి వదలడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఉపాధి నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటీలో ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీ కార్యక్రమాన్ని యాజమాన్యం బుధవారం నిర్వహించింది. ఇందులో భాగంగా అవసరమైన విద్యార్థులకు 100 గంటల పాటు ఉపాధి నైపుణ్యాలపై కోర్సుతో కూడిన శిక్షణ ఇవ్వనున్నారు. యాజమాన్య సభ్యుడు ఎస్.కృష్ణంరాజు, చీఫ్ మేనేజింగ్ ఆఫీసర్ సుబ్బరాజు, ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, ఐసీ కో–ఆర్డినేటర్ పి.నవీన్, ఐసీటీ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లల కోసం అన్వేషణ

- మండలంలో 719 మంది చిన్నారుల గుర్తింపు
- వారి చదువుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



9వ తరగతిలో బడి మానేసిన విజయకుమార్ ఇంటి వద్ద సీఆర్పీ త్రినాథ్, డ్రిల్ మాస్టర్ కనకరెడ్డి

తగరపువలస: భీమిలి మండలంలో బడిబయట ఉన్న చిన్నారుల సంఖ్య 719 ఉండటం ఆందోళన కలిగిస్తోంది. వీరిని గుర్తించేందుకు సీఆర్పీలు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఎంఆర్సీ సిబ్బంది, ఎంఈవోలు ఆలస్యంగా వేట మొదలుపెట్టారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరుమాసాలు గడుస్తున్నా విద్యాశాఖ కళ్లు తెరవకపోవడం కారణంగానే ఇంతమంది డ్రాపౌట్లు కనిపిస్తున్నారు.

భీమిలి మండలంలో 152 మంది విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ కాకపోవడం, 60 మంది విద్యార్థులకు చదువుపై ఆసక్తి లేకపోవడం, మిగిలిన వారిలో డ్రాప్ బాక్స్‌లో పెట్టకపోడం, వలస పోవడం వంటి కారణాలు కనిపించాయి.

- జీవీఎంసీ ఒకటోవార్డు శ్రీనగర్‌కు చెందిన మొయ్య విజయకుమార్ 9వ తరగతిలో ఉండగా ప్రమాదానికి గురయ్యాడు. ఈ విద్యార్థి తరువాత పాఠశాలకు వెళ్లకపోవడంతో గుర్తించిన సిబ్బంది ఓపెన్ టెన్త్ ద్వారా పంపించే ఏర్పాటు చేస్తున్నారు.
- రెండోవార్డు బైపాస్‌రోడ్డుకు చెందిన 7వ తరగతి విద్యార్థిని తుపాకుల సుప్రజ తల్లిదండ్రులు కుమారి, సత్తిబాబు పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ నిరక్షరాస్యులు. సుప్రజ నాలుగు మాసాలుగా స్కూల్‌కు వెళ్లకపోవడంతో ప్రధానోపాధ్యాయిని టీసీ ఇచ్చి పంపేశారు. ఈ విద్యార్థిని వసతిగృహం లేదా ఆమెకు నచ్చిన పాఠశాలలో చేర్పించేలా చూస్తున్నారు.
- చిట్టివలస జ్యూట్‌మిల్లు క్వార్టర్స్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి అఖిల్ నూకరాజు తండ్రి ఉదయ్ పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేస్తూ చనిపోయాడు. తల్లి వెంకటలక్ష్మి అంధురాలు. ప్రస్తుతం ఇద్దరు అక్కల సంరక్షణలో ఉన్నాడు. సరిగా చదవడం లేదని స్కూల్ యాజమాన్యం టీసీ ఇచ్చి పంపేసింది. నూకరాజును మరో పాఠశాలలో చేర్పించే దిశగా విద్యాశాఖ అడుగులు వేస్తోంది.

ఎమ్మెస్సీలో స్పాట్ అడ్మిషన్లు

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల బుధవారం తెలిపారు. ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించలేనివారు, పీజీ సెట్‌కు హాజరుకాని వారు ఇందులో చేరవచ్చన్నారు.

75 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెం, పాతపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో 75 మంది విద్యార్థులకు దివీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.సీజనల్ వ్యాధుల గురించి భీమిలి సీహెచ్‌సీ వైద్యులు కల్యాణి, నాయక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు రమణ, స్వాతి, విమల, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

పద్మనాభం: మండలంలోని లింగన్నపేట శివారు చెరువు వద్ద బుధవారం పేకాడుతున్న నలుగురిని పట్టుకుని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ జె.సురేష్ తెలిపారు. వీరినుంచిరూ. 7,400 స్వాధీనం చేసుకున్నామన్నారు.

'ది గ్రేట్ గ్రిల్ లూట్ ఫెస్టివల్' ప్రారంభం



వంటకాల గురించి వివరిస్తున్న నరేష్ నాయుడు

మధురవాడ: మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని బార్బెక్యూ నేషన్‌లో ది గ్రేట్ గ్రిల్ లూట్ ఫెస్టివల్ బుధవారం సాయంత్రం ప్రారంభమైంది. సీ ఫుడ్, ఎంటర్‌టైన్‌మెంట్ ఫెస్టివల్‌లో భాగంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని అన్ని ఔట్‌లెట్‌లలో ఈ నెల 27 నుంచి డిసెంబరు 15వరకు ఈ ఉత్సవం జరుగు తుందని సంస్థ ఆంధ్రప్రదేశ్ హెడ్ నరేష్ నాయుడు ముత్తులూరు చెప్పారు. ఆహార ప్రియులకు విశేషమై న సీఫుడ్ అనుభూతిని అందించనున్నామన్నారు.

విపత్తు నిర్వహణపై మత్స్యకారులకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

కొమ్మాది: తుఫాన్ వంటి విపత్తుల సమయంలో మత్స్యకారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో విపత్తు ప్రతిస్పందన దళం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ రక్షణ బోట్ల వినియోగం, అత్యవసరంగా అందించాల్సిన సాయం ఇతర పరికరాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు.

భీమిలిలో విద్యార్థులకు ..

భీమునిపట్నం: ప్రకృతి విపత్తులు, మానవ తప్పిదాల వల్ల జరిగే నష్టాలపై స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన దళం అవగాహన కల్పించింది. విశాఖ ఒకటో బెటాలియన్ డీఎస్పీ వి.నారాయణరావు, ఎస్ఐ వైకుంఠరావు మాట్లాడుతూ తుపాను 'సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి వివరించారు.ప్రధానోపాధ్యాయుడు పొన్నగంటి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధం అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు

భీమునిపట్నం: ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయడం నేరమని, అవి జరగకుండా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భీమిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి నాగేశ్వరరావు, ఒకటో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి సౌజన్య అన్నారు. 'బాల్య వివాహాలు వద్దు.. ఆడపిల్లలకు చదువే ముద్దు' నినాదంతో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఇక్కడ మెయిన్ రోడ్డు, బీచ్‌రోడ్డు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి, గంటస్తంభం వద్ద మానవ హారం ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం చేయడం నేరమని, దీనికి కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.వి.పార్వతీశం, కార్యదర్శి సుధాకర్, సీనియర్ న్యాయవాదులు గౌతమ్, సుందర్‌సింగ్, శివ, కనకమహాలక్ష్మి, అప్పలరాజు, మురళి, సూరిబాబు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన నేడు

తగరపువలస: పీఎం సూర్య గృహయోజన పథ కం కింద సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించే పథకంపై గురువారం ఆనందపురం ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు,సోలార్ వెండార్స్, బ్యాంకు అధికారులు పాల్గొంటారని జోన్–3 ఈఈ శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు.

భూలోకమ్మ పుట్ట వద్ద బోరు ఏర్పాటు



బోరు బావి తవ్వకం పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: భక్తుల తాగునీటి అవసరాలు తీర్చడానికి బోరు బావి ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. మండలంలోని కృష్ణాపురంలో భూలోకమ్మ పుట్ట వద్ద మండల పరిషత్ నిధులు రూ.1.10లక్షలతో ఏర్పాటు చేయనున్న బోరు బావి తవ్వకం పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మొకర లక్ష్మీ భవాని, ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, బొలె అప్పలనాయుడు, గాడు అప్పలరాజు, సుంకర నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై విస్తృత ప్రచారం



ర్యాలీలో పాల్గొన్న ఆర్‌డీడీ ఝాన్సీ లక్ష్మీబాయి

మధురవాడ: ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించనున్నామని ఆయుష్ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి తెలిపారు. పీఎం నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు దేశ్‌కా ప్రకృతి పరిరక్షణ్ అభియాన్ మాసోత్సవాల ప్రచారంలో భాగంగా మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 3 ఉమ్మడి జిల్లాల్లో అన్ని ఆస్పత్రుల పరిధిలో వచ్చే నెల 25వ తేదీ వరకు వైద్య శిబిరాలు, ర్యాలీలు నిర్వహించిన ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. మధురవాడ వైద్యాధికారి సుమ, మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.